క్లుప్తంగా

సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రం అందజేస్తున్న నాయకులు

నేరడిగొండ: హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో ఈనెల 12న నిర్వహించే సేవాలాల్ జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్‌లను గిరిజన లంబాడా ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ కోరారు. సోమవారం వారిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, తిరుమల్ గౌడ్, సర్పంచ్ గజానంద్, ప్రతాప్, కేంద్రే వెంకట్రావు, లింబాజీ, సంతోష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. సోమవారం మండలంలోని కుమారి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్, ఆయా ఉన్నారు.

ఇంద్రవెల్లి: తక్కువ బరువు ఉన్న పిల్లలను గుర్తించి పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అనిత, ప్రమీలా అన్నారు. సోమవారం మండలంలోని దనోర (బి) గ్రామంలో బలహీనమైన నవజాత శిశువుల సంరక్షణపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కాంబ్లే పురోశోత్తం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మటన్ క్యాంటీన్లు ఏర్పాటు చేయొద్దు

ఆదిలాబాద్‌రూరల్: హైదరాబాద్‌లో మటన్ క్యాంటీన్లు ఏర్పాటు చేయొద్దని ఆరె కటిక అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సోజి మురార్‌కర్ ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 17 ప్రభుత్వం మటన్ క్యాంటీన్లను ప్రారంభించడానికి నిర్ణయం తీసుకుందన్నారు. క్యాంటీన్లు ఏర్పాటు చేస్తే తాము ఎలా బతకాలని ప్రశ్నించారు. ఆరె కటిక కులస్తులను ఆదుకోవాలన్నారు.

చదువులో రాణించాలి



సౌండ్ సిస్టం అందజేస్తున్న ఎస్సై సాయన్న

నేరడిగొండ: విద్యార్థులు చదువులో రాణించాలని ఎస్సై సాయన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేశారు. ఇటీవల బోథ్ మేజిస్ట్రేట్ హుస్సేన్ సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థినులకు ఉపయోగపడేలా సౌండ్ సిస్టం అందజేయాలని తెలిపారు. దీంతో ఎస్సై సాయన్న, సర్పంచ్ పెంట వెంకటరమణ, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్ రెడ్డిలు అందజేశారు. విద్యార్థులు చక్కగా చదివి తలిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పాఠశాలకు అన్ని సౌకర్యాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్‌లను మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రంగినేని మనీషా పవన్ రావ్‌లు సోమవారం బీసీ సంఘ భవనంలో సన్మానించారు. బీసీల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, అంజయ్‌కుమార్, నర్సాగౌడ్, రాజు, కాసర్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నాయకులు

కైలాస్‌నగర్: కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించిన రాహుల్‌రాజ్‌ను సోమవారం కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నగేష్, అడె గజేందర్, సాయి చరణ్ గౌడ్, చంటి, రుపేష్‌రెడ్డి పాల్గొన్నారు.

తలమడుగు: ఆదిలాబాద్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాహుల్ రాజ్‌ను మండల జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, బజార్‌హత్నూర్ జెడ్పీటీసీ మాల్లె పూల నర్సయ్య, ఎంపీపీ కల్యానం లక్ష్మి రాజేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకన్న యాదవ్, రమేశ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాబన్న ప్రకాష్‌రావు, వినోద్ పాల్గొన్నారు.

పరిమితికి మించి తరలింపు



భారీ వాహనాలతో తరలిస్తున్న మొరం

- పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణానికి నిత్యం మొరం సరఫరా
- భారీ వాహనాలతో రోడ్లు ధ్వంసం
- పట్టించుకోని అధికారులు

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి శివారులో నిర్మిస్తున్న పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణానికి మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మొరం తరలిస్తున్నారు. రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా కట్ట నిర్మాణ పనుల సాగుతున్నాయి. భారీ వాహనాలతో ఎలాంటి నిబంధనలు పాటించకుండా మొరం మట్టిని తరలించడం ద్వారా మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. టిప్పర్లలో పరిమితికి మించి లోడింగ్, అతివేగంతో పాటు రాత్రిపూట మొరం తరలించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



ధ్వంసమైన భీంపూర్ పాఠశాల గోడ

నిత్యం మొరం తరలింపు..

రిజర్వాయర్ నిర్మాణ పనుల కోసం మొరం తరలింపులో సంబంధిత రిజర్వాయర్ కాంట్రాక్టర్ కనీస నిబంధనలు పాటించడం లేదు. వాహనాలలో పరిమితికి మించి మట్టిని లోడింగ్ చేసి యథేచ్ఛగా తరలిస్తున్నారు. భీంపూర్ మండలంలోని అందర్ బంద్, బెల్సరీరాంపూర్, మార్కగూడ, బుర్కపల్లి, భీంపూర్, వడ్గాం గ్రామ శివారుల నుంచి 50కి పైగా టిప్పర్ వాహనాలలో నిత్యం పరిమితికి మించి లోడింగ్ చేసి మొరం తరలిస్తున్నారు. రోడ్లపై మూల మలుపులు, స్పీడ్ బ్రేకర్లు ఉండడంతో మట్టి కింద పడి వాహనదారులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. భారీ వాహనాలతో రోడ్లు గుంతలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము, దూళి పంటలపై పడి దిగుబడి రావడం లేదని రైతులు వాపోతున్నారు.

దెబ్బతింటున్న రోడ్లు..

మండలంలోని ఆయా గ్రామాల రోడ్లు భారీ వాహనాలతో దెబ్బతింటున్నాయి. వారం రోజుల క్రితం భారీగా టిప్పర్ వాహనాలు ఏకధాటిగా నడవడంతో భీంపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ పూర్తిగా దెబ్బతిని బీటలు వారి కూలింది. దీంతో కాంట్రాక్టర్ ప్రహరీకి మరమ్మతులు చేయించారు. వాహనాల శబ్దాలకు సరిగా నిద్రపట్టడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం

రిజర్వాయర్ నిర్మాణం కోసం టిప్పర్ వాహనాలలో రోజు మొరం తరలించడంతో ఇబ్బంది పడుతున్నాం. నిత్యం వాహనాలతో మొరం తరలించడం ద్వారా వాహనాలు ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయంలో వాహనాలు వేగంగా నడుపడం వాళ్ల పిల్లలు, పెద్దలు నిద్రపోలేని పరిస్థితి నెలకొంది.

– పురుషోత్తం, భీంపూర్ గ్రామస్తుడు

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్

నార్నూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ రవీందర్ కోరారు. సోమవారం గాదిగూడ మండలంలోని రుప్పాపూర్ గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించారు. కంటివెలుగుపై ప్రజలకు అవగాహన కల్పించారు. అవసరం ఉన్న వారికి వైద్యుల సూచనల మేరకు కంటి ఆపరేషన్లు చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం కల్పన, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి



ప్రచారం నిర్వహిస్తున్న వన్నెల అశోక్

ఇచ్చోడ: కాంగ్రెస్‌ను ఆదరించాలని టీపీసీసీ సభ్యులు వన్నెల అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని కోకస్‌మన్నూర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత తొమ్మిది సంవత్సరాల నుంచి రాష్ట్రాన్ని పాలిస్తున్న టీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు కాని హామీలు ఇచ్చి అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తుందన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించి, రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఆయన వెంట నాయకులు ప్రవీణ్‌రెడ్డి, పట్ల గోవర్దన్, గంగారెడ్డి, జాంటీ, కోటేశ్వర్ పాల్గొన్నారు.

ఖోడద్‌లో పర్యటించిన ట్రెయినీ కలెక్టర్



వివరాలు తెలుసుకుంటున్న ట్రెయినీ కలెక్టర్ శ్రీజ

తలమడుగు: మండలంలోని ఖోడద్ గ్రామంలో సోమవారం ట్రెయినీ కలెక్టర్ శ్రీజ పర్యటించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పింఛన్ల వివరాలు, సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అనంతరం పల్లెప్రకృతి వనం, శ్మశానవాటిలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో దీలిప్, సర్పంచ్ సాకే ఆనంద్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఇసుక తరలింపుపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

బేల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ బడాల రాంరెడ్డికి మండలంలోని సాంగిడి గ్రామశివారులోని పెన్‌గంగ నుంచి అక్రమ ఇసుక తరలింపుపై గ్రామ యువకులు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇసుక అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోవాలన్నారు. పలువురు వ్యాపారులు సిండికేట్ అయి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మేకల జితేందర్, ముత్యాల సురేష్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

అంకెలగారడీ బడ్జెట్

బోథ్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంకెలగారడీ తప్ప ప్రజలకు ఉపయోగం లేదని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని బడ్జెట్‌లో ఎక్కడా చెప్పలేదన్నారు. విద్య, వైద్యం, సంక్షేమ శాఖలకు మరింత బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ట్రాఫిక్ సీఐగా ఎం. అశోక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇదివరకు ట్రాఫిక్ సీఐగా పనిచేసిన మల్లేష్ నిర్మల్ జిల్లాకు బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే.

పరీక్ష సామగ్రి పంపిణీ

బేల: మండలంలోని సాంగిడి గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సోమవారం పరీక్ష ప్యాడ్‌లు. పెన్నులు, స్కేల్‌లను 2006– 07బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంషోద్దిన్, పూర్వ విద్యార్థులు రమాకాంత్, గణేష్, విపుల్, సురేందర్, సలీం, సంజయ్ పాల్గొన్నారు.

అందుబాటులో ఉండాలి

బజార్‌హత్నూర్: అత్యవసర సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని 102, 108 వాహనాల జిల్లా కోఆర్డినేటర్ వసంత్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంబులెన్స్ వాహనాలను, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గర్భిణులకు ఇంటి నంచి ఆస్పత్రికి తీసుకువచ్చి జాగ్రత్తగా ఇంటి వద్ద దించాలన్నారు. ఏఎఫ్ఈ వసీం, ఈఎంటీ సతీష్, పైలెట్ రాజారాం, నవీన్, రాజు పాల్గొన్నారు.

పనులు ప్రారంభం

నార్నూర్: గాదిగూడ మండలంలోని అర్జుని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో మనఊరు.. మనబడి పనులను సోమవారం గ్రామపటేల్ కుమ్ర రాహాజీ పటేల్, సర్పంచ్ కానులు ప్రారంభించారు. గ్రామస్తులు చేసిన తీర్మాన కాపీని కాంట్రాక్టర్ సురేశ్‌కు అందజేశారు. ఐటీడీఏ ఏఈ సునీల్ రాథోడ్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధి కోసం రూ. 25.25 లక్షలు ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ కింద మంజూరైనట్లు తెలిపారు. హెచ్‌ఎం రాజేశ్వర్, ఎస్ఎంసీ చైర్మన్ గెడం జ్యోతిబాయి పాల్గొన్నారు.

అడవిని కాపాడుకుందాం..



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

- అటవీ సంరక్షణకు చర్యలు
- అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన

సిరికొండ: అటవీ ప్రాంతాల్లో వేసవి జరిగే అగ్ని ప్రమాదాలను నివారించేందుకు అటవీశాఖ చర్యలు ప్రారంభించింది. వేసవి కంటే ముందే అడవుల్లో చెట్ల ఆకులు రాలి ఎండిపోయి ఉంటాయి. దీంతో ఏచిన్న అగ్గి రవ్వ పడిన క్షణాల్లో మంటలు వ్యాపించి అడవి కాలిపోతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

అగ్ని ప్రమాదాలతో నష్టం..

జనవరి నుంచి వాతావరణ మార్పుల వల్ల ఆకు రాలడం మొదలవుతుంది. ఈనెల చివరి వరకు అడవుల్లోని నేలపై ఎండిన ఆకులు పరిచినట్లు ఉంటుంది. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి భారీ నష్టం జరుగుతుంది. ప్రధానంగా రోడ్ల వెంట వెళ్లేవారు, పశువులు ఆవులు, మేకలు మేపే వారు అడవుల్లో సిగరెట్, బీడీ కాల్చి పడేస్తేనే మంటలు వ్యాప్తిస్తున్నాయి.



ఫైర్‌లైన్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఫైర్‌లైన్లతో నివారణ చర్యలు..

అగ్ని ప్రమాదాల బారీ నుంచి అడవిని కాపాడేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఫైర్‌లైన్లను ఏర్పాటు చేసి, ఎండిన ఆకులను ఒక చోటకు చేర్చి కాల్చివేస్తారు. ఆకులు కాలిపోయిన వెంటనే మంటలు ఆర్పేస్తారు. దీంతో అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉంటుంది. అనుకోకుండా మంటలు అంటుకుంటే మంటలు ఎక్కువ దూరం పోకుండా ఉంటుంది.

అవగాహన కార్యక్రమాలు..

అడవుల్లో జరిగే అగ్ని ప్రమాదాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అడవులను రక్షించడం, అగ్ని ప్రమాదాల నివారణ చర్యల గురించి వివరిస్తున్నారు. అడవిలోకి వెళ్లినప్పుడు బీడీలు, చూట్లు తీసుకుపోవద్దని, ఎకడైన మంటలు అంటుకుంటే చెట్ల కొమ్మలతో ఆర్పివేయాలని సూచిస్తున్నారు. నిప్పు పెడితే మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించడం జరుగుతుందని గోడ ప్రతులు అంటిస్తున్నారు.

చెట్లను సంరక్షించాలి

అడవులను రక్షించడం మనందరి బాధ్యత. అడవులు బాగున్నప్పుడే మనకు సమృద్ధిగా వర్షాలు కురుస్తాయి. వాతావరణంలో ఎలాంటి మార్పులు ఉండవు. బీడీ, సిగరేట్ తాగి అడవిలో పడేయవద్దు. అగ్ని ప్రమాదాలు జరిగితే ఆర్పివేసేందుకు ప్రయత్నించాలి.

– గీరయ్య, సెక్షన్ ఆఫీసర్, సిరికొండ

అటెన్షన్ ప్లీజ్..

శిథిలావస్థలో అతిథి గృహం



నేరడిగొండ: మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన నిజాం నవాబులు నిర్మించిన అతిథి గృహం పాలకుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారింది. గత కొన్నేళ్లుగా అతిథిగృహం అభివృద్ధి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు శాశ్వతంగా మూసివేశారు.

– సంబంధిత అధికారి: అరవింద్, ఆర్‌అండ్‌బీ, ఏఈఈ, ఫోన్: 94906 12770

హక్కుల సాధన కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న సోనేరావ్

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీల హక్కుల సాధన కోసం ఉద్యమించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్, హక్కుల సాధన నిర్వాహణ కమిటీ కన్వీనర్ కొడప సోనేరావ్‌లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పిట్టల్‌వాడలోని ఆదివాసీ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఆరోపించారు. సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయికే సంజీవ్, జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్ర శ్యాంరావ్, ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, వైస్ ఎంపీపీ జంగు, ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.

విద్యార్థులను దత్తత తీసుకోవాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం నర్సయ్య

ఆదిలాబాద్‌రూరల్: పాఠశాలలో 68 మంది పదో తరగతి విద్యార్థులుఉ చదువుతున్నారని, ఒక్కొక్క ఉపాధ్యాయుడు ఏడుగురు విద్యార్థులను దత్తత తీసుకోవాలని అంకోలి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంటె నర్సయ్య అన్నారు. సోమవారం ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకోవడం ద్వారా పర్యవేక్షణ పెరుగుతుందన్నారు. అలాగే ఉదయం సాయంత్రం స్లిప్ టెస్టులు నిర్వహించాలన్నారు. ఈనెల 15 నుంచి 20 వరకు ఇంటర్‌నల్ మార్క్స్ వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. ప్రిఫైనల్‌కు వంద శాతం విద్యార్థులు హాజరయ్యేలా చూడాలన్నారు.

'కుప్టి ప్రాజెక్టుపై ఊసేత్తని ప్రభుత్వం'



మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఇచ్చోడ: రాష్ట్ర బడ్జెట్‌లో కుప్టి ప్రాజెక్టుపై ప్రభుత్వం ఊసేత్త లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మాట్లాడారు. కడెం వాగుపై ప్రాజెక్టు చేపడుతున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం తొమ్మిదెళ్లు గడుస్తున్నా.. బడ్జెట్లో నిధులు కేటాయించలేదన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. లక్షల కోట్లు ప్రవేశపెట్టామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం వాటిని ఖర్చు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని మండిపడ్డారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అడే మానాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, జిల్లా కార్యదర్శి కొల్లురి చంద్రశేఖర్, రాజుయాదవ్, సుర్యకాంత్ గిత్తె, కేంద్రే నారాయణ పాల్గొన్నారు.

హిడెన్‌బర్గ్ నివేదికలు బహిర్గతం చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: హిండెన్‌బర్గ్ నివేదికలు బహిర్గతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో గల ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట కాంగ్రెస్ నిరసన తెలిపారు. ప్రధాని మోదీ కార్పొరేట్ వ్యాపారులకు ప్రభుత్వ ఆస్తులను ధారదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. ఎల్ఐసీ సొమ్మును మోదీ ప్రభుత్వం దిగమింగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యాపారులకు కొమ్ముకాస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ మెంబర్ నరేష్ జాదవ్, గజేందర్, భూపెల్లి శ్రీధర్, గుడిపెల్లి నగేష్, సంజీవ్ రెడ్డి, భీమన్న, పసుల చంటి, అశోక్, ఆనంద్‌రావు, చరణ్ గౌడ్, అర్బాత్ ఖాన్, మహేందర్, నారాయణ్‌రెడ్డి పాల్గొన్నారు.

వాట్సాప్‌తో కాలక్షేపం..



ప్రతీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణిలో జిల్లా స్థాయి అధికారులు వాట్సాప్‌లో చాటింగ్ చేస్తూ.. కాలక్షేపం చేస్తున్నారు. చాలా దూరం నుంచి సమస్యల పరిష్కారం కోసం వచ్చిన బాధితులకు న్యాయం జరగక నిరాశతో వెనుదిరుగుతున్నారు. అధికారులే సెల్‌ఫోన్లలో నిమగ్నమై పట్టించుకోకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్







క్షీరాభిషేకం

బోథ్: తెలంగాణ బడ్జెట్‌లో బడుగు బలహీనవర్గాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు మండలంలోని కనుగుట్ట బీఆర్ఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. చిన్నయ్య, దేవిదాస్, అశోక్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.